# 'చదువుల వాడలో'

చదువుకోడం పోయింది. చదువు 'కొనడం' వచ్చేసింది. ఇది అందరికీ తెల్సిన సత్యమే.

ఇప్పుడు చదువు అతిపెద్ద వ్యాపారం. పూర్తి కార్పొరేట్ స్థాయికి విస్తరించింది. అయితే అన్ని వ్యాపారాలకూ ఓ సీజనుంటుంది. చదువుల వ్యాపారానికి మాత్రం సాలు పొడుగునా సీజనే. ఈ వ్యాపారం వచ్చింతర్వాత అత్యుత్తమైన చదువు. ఇంజనీరింగ్ లేకపోతే డాక్టరీ... ఆ రెండు మినహా చదువుల్లేవు. వున్నా అవి చదువుల కావు.

పిల్లల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సాంఘిక శాస్త్రాలు యిప్పుడు అసాంఘిక శాస్త్రాలు. సాహిత్యం, చరిత్రల సంగతి సరేసరి.

కొన్ని కాలేజీల్లో సాంఘీక శాస్త్ర విభాగాలు అస్సలు లేవు. కొండొకచో వుంటే అందులోని విద్యార్థులు విద్యార్థులు కారు.

ఏడూ ఎనిమిది తరగతుల్నించే ఐ.ఐ,టి దృక్పథంతో చదువు అన్న సూత్రాన్ని పట్టుకొచ్చాడో పెద్దాయన. ఒకప్పుడు లెక్కల ట్యూషన్లు చెప్పుకునే ఆయన ఇప్పుడో పెద్ద వ్యవస్థ. ఈ విషయంలో మొదటి నేరం తల్లిదండ్రులది. వాళ్ల అజ్ఞానాన్నీ భావ దారిద్ర్యాన్నీ ఆసరాగా తీసుకుని స్కూళ్లూ కాలేజీలూ అనే కుక్కగొడుగుల వాళ్లు వాళ్ల పబ్బం గడుపు కుంటున్నారు. దానికితోడు ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా కాలేజీలకు పర్మిషన్లివ్వడం, అవినీతి అధికారులు ఏ సౌకర్యాలూ లేని సంస్థలకు, కనీసం ఇన్‌స్పెక్షన్ కూడా లేకుండా పర్మిట్లు ఇచ్చేయడం... పర్యవసానం అభంశుభం తెలీని పిల్లలు బలిపశువులు కావడం. ఈ వ్యాపారంలో ఎంత డబ్బు ఉందో ఆయా సంస్థలవాళ్లు పుంఖాను పుంఖాలుగా లక్షలు ఖర్చు పెట్టి ఇచ్చే వ్యాపార ప్రకటనలు చూస్తే చాలు తెలుస్తుంది.

సరే వ్యాపారం అని అన్నాంకదా... 'వ్యాపారం ద్రోహ చింతనం' అన్న నానుడిని నిజం చేస్తూ రకరకాల వేషాల్తో చదువుల మోసం జరుగుతోంది. దానికి ఓ మచ్చు... మా చిట్టిబాబు కొడుకు మొన్న పదవతరగతి చాలా మంచి మార్కుల్తో పాసు అయ్యాడు. వెంటనే ఓ రోజు ఉదయాన్నే మా చిట్టిబాబుకు ఫోను. "నేను ఫలానా కాలేజీ నించి మాట్లాడుతున్నాను. 'చదువులవాడ'లో మా కాలేజీ ఆహాఁఓహోఁ మీ అబ్బాయికి వచ్చిన మార్కుల గురించి

తెల్సుకుని మీకు ఫోనూ... మీవాణ్ణి మా కాలేజీలో చేర్పించితే మీకు 50 శాతం డిస్కౌంట్."

మా చిట్టి తన్నుకు చచ్చాడు. ఎక్కడ చదువులవాడా? ఎక్కడ కర్నూలు? అని... అంతటితో ఆగలేదు. దాంతర్వాత వరుసగా ఓ ముగ్గురు ఇంటికి వచ్చారు 'మా కాలేజీ' అంటే 'మా కాలేజీ' అంటూ. ఒకరు 60 శాతం డిస్కౌంట్ అంటే ఇంకోరు 80 శాతం అని... మా చిట్టి ఉన్న కాస్త జుత్తు పీకేసుకున్నాడు. అన్నీ పక్కకు పెడితే మా చిట్టి కొడుకు "నా స్నేహితులు చదువులవాడలో చేరుతున్నారు, నేనూ అక్కడే చదువుతా" అని బాంబు వేసాడు. చేరతానన్న దగ్గర చేర్చకపోతే అస్సలు చదవకపోతే! సరే చలో చదువులవాడ.

సీన్ : చదువుల వాడ ఫలానా కాలేజి క్యాంపస్. ఎక్కడ చూసినా పిల్లలూ పిల్లల తల్లిదండ్రులూ, తాతలూ, మేనమామలూ, బాబాయిలూ... పిన్నులూ (పినమ్మలు అని చదువుకో ప్రార్థన) ముందుగా ఎంట్రెన్స్ పిల్లలకి. ప్రతి విద్యార్థీ అందులో నెగ్గి తీరుతాడు. సరే మా చిట్టి కొడుక్కి ఎంట్రెన్స్‌లో వందకు వంద.

సీన్ కట్!

నెక్స్ సీన్ : కరస్పాండెంటు గది... చిట్టి తన కొడుకుతో కూచుని వున్నాడు. కరస్పాండెంటు ఫీజు తదితర వివరాలు చెబుతుండగా ఓ వ్యక్తి ఆదరాబాదరా లోపలికి దూసుకొచ్చి కరస్పాండెంటు టేబిలు మీద నోట్లకట్టలు గుమ్మరించి "నిన్న వచ్చి వెళ్లానండీ మా ముగ్గురి పిల్లలదీ ఫీజు ఈరోజు చేర్చేస్తున్నా" అన్నాడు.

ఒక్కో విద్యార్థికీ మా చిట్టికి తెల్సిన సమాచారాన్ని బట్టి ముప్ఫైఏడువేలు... అంటే ముగ్గురికి లక్షాపదకొండు వేలు. ఆ వచ్చిన వ్యక్తి అంతే గాబరాగా రసీదు తీసుకుని మాయమైపోయాడు. కరస్పాండెంటు "ఇదండీ పరిస్థితి మీరు త్వరగా ఓ నిర్ణయానికి రండి" అని ఫైళ్లలో తలదూర్చాడు. మా చిట్టికి చెమటలు పట్టాయి. ఈ పోటీలో తన కొడుక్కి సీటు ఎలా? అని.

సీన్ కట్–

నెక్స్ సీన్ : అదే ఫలానా కాలేజీ మర్నాట్రోజు. మా చిట్టికొడుకుని పెట్టుకుని ఓ చెట్టుకింద దీర్ఘాలోచనలో... ఇంతలో దూరంగా నిన్న లక్షా చిల్లర ఫీజు కట్టిన వ్యక్తి చంకలో జిప్ బ్యాగుతో ఆఫీసు గదిలోకి వెళ్తూ కనిపించాడు. చిట్టికి అనుమానం వచ్చి ఆ వ్యక్తి వెనకాలే వెళ్లాడు.

చిట్టి ఆ వ్యక్తిని గుర్తుపట్టాడు. కానీ ఆ వ్యక్తి చిట్టిని గుర్తుపట్టలేదు. లోపల ఆఫీసు గదిలో కరస్పాండెంట్ ఎదురుగా ఓ ముగ్గురు పిల్లల చదువు బాధితులు కూచుని

వున్నారు. ఈ వ్యక్తి ఆదరాబాదరా గదిలోకి వెళ్లి బ్యాగులోంచి నోట్లకట్టలు తీసి మళ్లీ నిన్నటి డైలాగే వల్లించాడు. మా చిట్టికి ఒక్కసారి జ్ఞానోదయమైంది.

పిల్లలు తల్లిదండ్రుల్ని 'చూడండి మా కాలేజీలో సీట్లకెంత డిమాండో' అన్పూపించేందుకు ఆడే డ్రామాగా తెలిసిపోయింది.

ఇంత జరిగినా మా చిట్టి చదువులవాడలోనే తన కొడుకును చేర్చాడు. అది వేరే సంగతి... పిల్లల తల్లిదండ్రులూ ఆలోచించండి.

* * *

***ఈ వ్యాసం ప్రూఫ్ చూస్తుంటే... పిల్లలిద్దర్నీ అద్భుతంగా తీర్చిదిద్ది చదివించి... వ్యసనానికి బానిసై మొన్ననే కన్నుమూసిన చిట్టి గుర్తొచ్చి మనసు చెమ్మగిల్లుతోంది...*** ●

*ఇది సరిగ్గా ఓ దశాబ్దం క్రితం మాట.*